క్లుప్తంగా

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



సత్తెనపల్లి: ఛత్రపతి శివాజీ పట్టాభిషేకమైన రోజును పురస్కరించుకొని సత్తెనపల్లి మహారాష్ట్ర వీధిలో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి బుధవారం పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. హిందువుల పౌరుషం, పరాక్రమములను లోకానికి వెల్లడించిన ఛత్రపతి శివాజీ పట్టాభిషేకమైన రోజు(జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి)ను హిందూ సామ్రాజ్య దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకుంటున్నామని మాజీ కౌన్సిలర్ పులహరి భానోజీ అన్నారు. ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలను వీరోచితంగా పోరాడిన సందర్భాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు, ఆరె క్షత్రియులు, ఆర్య మరాఠీ సంఘ సభ్యులు నర్సోజి, గోవిందు, వెంకోజీ, ఫిరోజి, వెంకటేశ్వర్లు, రఘు, అశోక్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పేద ఆర్యవైశ్య కుటుంబానికి రూ.1.10 లక్షలు ఆర్యవైశ్య నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని 22వ వార్డులో నివాసం ఉంటున్న చిన్ని కృష్ణకుమారి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఇంటికి పెద్దదిక్కు లేక పోవడం, ఇద్దరు ఆడపిల్లలతో జీవనం సాగిస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ రావటం వల్ల బాగా ఇబ్బందిగా ఉందని ఆర్థిక సాయం కావాలని బంధువు అయిన ఆకుతోట దుర్గారావు, కొత్త రామకృష్ణలను సంప్రదించింది. వారు వాట్సాప్, సోషల్ మీడియాలో మెసేజ్ పంపించారు. అది చూసి దాతలు స్పందించి సుమారు రూ.1.10 లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. బుధవారం కొత్త రామకృష్ణ తన జన్మదినోత్సవం సందర్భంగా ఆ నగదును అందజేశారు. దాతలు ముందుకు రావటానికి ముఖ్య పాత్ర వహించిన దివ్వెల శ్రీనివాసరావు, ఆకుతోట దుర్గారావు, కొత్త రామకృష్ణలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వర్లు, భవిరిశెట్టి హరి తదితరులు ఉన్నారు.

పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సత్తెనపల్లి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు బొర్రా వెంకట అప్పారావు ఆదేశాల మేరకు కార్యకర్తలు పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గంలో బొర్రా వెంకట అప్పారావు శ్రమకి ఫలితం దక్కిందని వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ మండల నాయకులు నాదెండ్ల నాగేశ్వరరావు, జిల్లా నాయకులు చిలక పూర్ణ, మండల నాయకులు అద్దేపల్లి రామారావు, షేక్ ఖాసిం, మట్టం సురేష్, షేక్ రఫీ, మట్టం మహేష్, అద్దేపల్లి మరలింగయ్య, భూపతి, పొన్నకోటి భద్రయ్య, మీన్నగంటి సత్యం, వెంకట్రావు జనసైనికులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కౌలు రైతు గుర్తింపు కార్డు

పెదకూరపాడు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కౌలు రైతు గుర్తింపు కార్డు అందించనున్నట్లు తహసీల్దారు ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని లగడపాడు, గారపాడు గ్రామాల్లో కౌలు రైతు గుర్తింపు కార్డు గ్రామ సభలను ఆయన ప్రారంభించారు. కౌలు రైతుల నుంచి గుర్తింపు కార్డు కోసం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను మండలంలో 2,363 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే లక్ష్యంతో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే పనిలో పెట్టుకోవాలి

సత్తెనపల్లి: బాల కార్మికుల నిర్మూలన కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్మిక శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుందని సహాయ కార్మిక శాఖాధికారిణి వి.అన్నపూర్ణ బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి వాణిజ్య దుకాణాలలో తనిఖీలు నిర్వహించనున్నామన్నారు. దుకాణంలో 18 ఏళ్ల వయసు కంటే తక్కువ ఉన్న బాలబాలికలను పెట్టుకోవద్దన్నారు. ప్రతి వ్యాపారి 18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే పని చేయుటకు తీసుకోవాలన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వారిని పెట్టుకుంటే గుర్తించి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్మిక శాఖ చట్టాలను ఉల్లంఘించి ప్రవర్తించినచో ఆ దుకాణంపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ఖాళీ స్థలం.. వ్యాధులకు నిలయం

- ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలతో అవస్థలు
- డంపింగ్ యార్డులను తలపిస్తున్న వైనం
- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి



పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఖాళీ స్థలంలో డంపింగ్‌యార్డ్‌లా చెత్త

సత్తెనపల్లి: పట్టణంలో ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వాటి నిర్వహణను స్థల యజమానులు, మున్సిపల్ అధికారులు పూర్తిగా మరిచారు. ఫలితంగా మురుగు నీటి కుంటలు, చెత్తకుప్పలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. అందులోనే విష పురుగులు నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. సమీపంలో నివాసం ఉన్న వారు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆ బాధ్యత తమది కాదని అంటున్నారు. స్థల యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తామని చెప్పి పంపుతున్నారు. 31 వార్డులు ఉన్న పురపాలక సంఘంలో ప్రతి వార్డులోనూ దాదాపు మురుగు కుంటలు ఉన్నాయి. వాటి నిర్మూలనకు పురపాలక అధికారులు ఎలాంటి ప్రణాళికలు అమలు చేయడం లేదు.

చట్టం ఏం చెబుతోంది

1965 పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల నిర్వహణను నిర్లక్ష్యం చేసే యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఖాళీ స్థలాల వల్ల ప్రజారోగ్యానికి, సాధారణ జన జీవనానికి ప్రమాదం వాటిల్లితే పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ప్రాథమికంగా చర్యలు తీసుకుంటారు. స్థల యజమానులు అప్పటికీ స్పందించకపోతే కమిషనర్ నోటీసులు జారీ చేస్తారు. అయినా నిర్లక్ష్యం చేస్తే పురపాలక సంఘానికి చెందిన స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయవాది) ద్వారా నోటీసులు అందజేసి కోర్టులో కేసు నమోదు చేస్తారు. ఆరోపణలు రుజువైతే జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది.



ముళ్ల చెట్లతో అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం

ప్రజారోగ్యం పాలిట ప్రమాదం

నివాస ప్రాంతాల మధ్య గల ఖాళీ స్థలాలు ప్రజారోగ్యం పాలిట అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఖాళీ స్థలాల నిర్వహణను వాటి యజమానులు పట్టించుకోకుండా వదిలేశారు. పురపాలిక నిర్వహణ బాధ్యత తమది కాదని చెబుతోంది. స్థలాల యజమానులు, అధికారులు ఈ సమస్యను ఇలాగే వదిలేయడంతో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ప్రజారోగ్య చట్టం ప్రకారం ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకునే అవకాశం అధికారులకు ఉన్నా అధికారాలను వినియోగించుకోవడం లేదు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి

నకరికల్లు: పొలం కౌలుకు తీసుకొని పంటలను సాగుచేస్తున్న వాస్తవ కౌలు రైతులందరూ పంట సాగుదారు హక్కుపత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో కౌలు రైతుల అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులు పొందవచ్చన్నారు. కౌలుదారుని దరఖాస్తు, కౌలుదారుని ఫొటోలు–2, ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, భూ యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీసీఆర్‌సీ కార్డుకు కేవలం 11 నెలల పరిమితి మాత్రమే ఉంటుందన్నారు. కౌలు రైతులకు సాగు చేస్తున్న పంటమీద మాత్రమే హక్కు ఉంటుందని అన్నారు. కౌలు రైతు కార్డు మంజూరు చేయడం ద్వారా భూ యజమానికి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన రాకుండా ఉండదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, వీఆర్వో షేక్ సైదా, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.ప్రసన్నకుమార్, చింతపల్లి ఫకీర్‌అహ్మద్, బండా జైనుల్లా, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు, పక్కన తహసీల్దార్ నగేష్, వీఆర్వో సైదా

కౌలు కార్డులపై అవగాహన

క్రోసూరు: మండలంలోని అన్ని ఆర్బీకేల్లో కౌలు రైతులకు కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం క్రోసూరు–1 ఆర్బీకేలో రైతులకు ఏవో వేణుగోపాల్ అవగాహన కల్పించారు. వీరితో పాటు తహసీల్దార్ ఎం.సువర్ణ, డీటీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ ఏడాది కౌలు సాగు చేసే ప్రతి రైతు రెవెన్యూ శాఖ ఇచ్చే పంట సాగు పత్రాన్ని తప్పక పొందాలన్నారు. మండలానికి 2,363 కౌలు కార్డులు లక్ష్యంగా ఇచ్చినట్లు తెలిపారు. పంట సాగు పత్రం వలన ఉపయోగాలు తెలుపుతూ పండించిన పంట మద్దతు ధరకు విక్రయించేందుకు వీలుపడుతుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొందవచ్చన్నారు. పంట బీమా, పంట నష్టం జరిగినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందన్నారు. కౌలు కార్డులు పొందేందుకు యజమాని పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, లేకుంటే 1బి అడంగల్ కాపీ, సొంత రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలు రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలురైతు పాస్‌పోర్టు సైజు ఫొటోలు–3, దరఖాస్తు ఫారం పూర్తి చేసి వీఆర్వోలకు అందజేయాలన్నారు. ఈ నెల 20న ఎర్రబాలెం, అందుకూరు, 21న బయ్యవరం, ఊటుకూరు, 22న అనంతవరం, పీసపాడు, 24న దొడ్లేరు, ఆవులవారిపాలెం, 25న 88త్యాళ్లూరు, గుడిపాడు, 26న నాగవరం, హసనాబాద్‌లోని ఆర్బీకేల్లో కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏవో తెలిపారు.

గ్రామాల్లో కౌలు కార్డులపై అవగాహన సదస్సులు

బొల్లవరం(ముప్పాళ్ల): మండలంలోని బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లో కౌలు రైతు రుణ అర్హత కార్డుల ఎంపికపై బుధవారం గ్రామ సభలు జరిగాయి. ఆయా గ్రామ సభల్లో తహసీల్దార్ పి.సింగారావు, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణలు పాల్గొని కౌలు కార్డు ప్రయోజనాలను వివరించారు. భూ యజమాని అంగీకారంతోనే కౌలు రుణ అర్హత కార్డు మంజూరు చేయటం జరుగుతుందని, ప్రతి కౌలు రైతు సాగు చేసిన పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ నమోదు లేకుంటే ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు అందకుండా పోతాయని చెప్పారు. కౌలు రైతులు గ్రూపుగా ఏర్పడి బ్యాంక్‌లలోను రుణాలు పొందవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌ఐ ఆంజనేయులు, వీఆర్వోలు టి.సంజీవరావు, ఎస్.హరిబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పి.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

26 వరకు అవగాహన సదస్సులు

ఈ నెల 20వ తేదీన ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, 21న నార్నెపాడు, పలుదేవర్లపాడు, 22న గోళ్ళపాడు, లంకెలకూరపాడు, 25న మాదల–1, మాదల–2, ఇరుకుపాలెం, 26న రుద్రవరం, తొండపి గ్రామాల్లో అవగాహన సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు.

నేటి నుంచి కౌలు రైతుల గుర్తింపు గ్రామ సభలు

సత్తెనపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 2024–25 పంట సంవత్సరమునకు గాను 2009 భూ అధీకృత రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేయుటకు లక్ష్యాలు విధిస్తూ జిల్లా సంయుక్త కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆదేశించారని తహసీల్దార్ సీహెచ్ ఉష బుధవారం తెలిపారు. ఈ నెల 20 నుంచి మండలంలో గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. 2024–25 సంవత్సరానికి మండల వ్యాప్తంగా 3,080 కౌలు రైతు కార్డులు లక్ష్యంగా విధించడం జరిగిందన్నారు. ఈ నెల 20న అబ్బూరు, ఫణిదం–1, ఫణిదం–2, బట్లూరు, భీమవరం, 21న కందులవారిపాలెం, బృగుబండ, ధూళిపాళ్ల, కంకణాలపల్లి, 22న గోరంట్ల, కట్టమూరు, రెంటపాళ్ల, పాకాలపాడు గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. 25న పెదమక్కెన, గుడిపూడి, నందిగామ–1, నందిగామ–2, 26న కంటెపూడి, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, 27న సత్తెనపల్లి, వడ్డవల్లిలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలు (సీసీఆర్సీ కార్డులు) మంజూరుపై రైతులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, వీఏఏలు రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి అవగాహన సదస్సులకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రతి గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ అధికారి ఒక్కొక్కరు 10 చొప్పున ప్రతి రోజు 20 కౌలు రైతు కార్డులు తగ్గకుండా జారీ చేయాలన్నారు.

పిడుగుపాటుకు గురైన గొర్రెల కాపరి

ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు

యడ్లపాడు: గొర్రెలు కాచేందుకు వెళ్లి పిడుగుపాటుతో షాక్‌కు గురైన బాలుడి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి గ్రామానికి చెందిన గొర్రెల యజమాని గోవాడ శ్రీనివాస్ వద్ద మండల కేంద్రంలోని సవళ్ల ప్రాంతంలో నివసించే ఆవుల అంజయ్య, కుమారి దంపతుల నాల్గో కుమారుడు ఏడుకొండలు కొద్దిరోజులుగా గొర్రెల కాచేందుకు పని కుదుర్చుకుని వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం జొన్నతాళి సమీప పొలాల్లో గొర్రెలు కాస్తుండగా వర్షం కురిసింది. గోవాడ శ్రీనివాస్ చెట్టుకిందకు చేరాడు. సరిగ్గా అదే సమయంలో చెట్టుపై నుంచి శ్రీనివాస్‌పై పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు సమీపంలోనే ఉన్న ఏడుకొండలు పిడుగుపాటుకు షాక్ తగిలి పక్కనే ఉన్న కాల్వలోకి దూకాడు. కొద్ది సేపటి తర్వాత తేరుకుని కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా, ఘటనా స్థలానికి చేరుకుని తమ కుమారుడిని స్వగ్రామానికి తీసుకువచ్చారు. షాక్ కారణంగా కాళ్లు ముడుచుకోవడం లేదని, కళ్లు మసగ్గా ఉన్నాయంటూ బాలుడు చెప్పడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.



చికిత్స పొందుతున్న ఏడుకొండలు

స్టూడెంట్ కిట్స్ పంపిణీ

నరసరావుపేట: మెరుగైన విద్యను అందించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడు తొలి ప్రాధాన్యం ఇస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని పాతురులో గల శ్రీ కందుకూరి వీరేశలింగం పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. పిల్లలంతా కిట్లను సక్రమంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రరెడ్డి, ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డి, మార్కెట్ సెక్రటరీ ఆంజనేయులు, మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, నాయకులు కపలవాయి విజయకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు కడియాల రమేష్, బొడ్డపాటి పేరయ్య, మాజీ కౌన్సిలర్లు వాసిరెడ్డి రవి, కొట్టా కిరణ్, కొవ్వూరు బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 గంటల్లోపు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కావాలి

ఎంఈవో జఫ్రుల్లా

వినుకొండ (నూజెండ్ల): ఉదయం 10 గంటల లోపు ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలనీ, అలాగే ఫీజుల వివరాలు, ఉపాధ్యాయుల పేర్లు, విద్యార్హతలు, బోధించే తరగతుల వివరాలు నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని ఎంఈవో జఫ్రుల్లా ఆదేశించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో అనుసరించవలసిన విధివిధానాలపై సూచనలు చేశారు. తమ పాఠశాలల్లో స్టేషనరీ, సమదుస్తులు, బ్యాగ్స్ విక్రయించకూడదన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. రవాణా శాఖాధికారుల ఫిట్‌నెస్ అనుమతితో బస్సులను నడపాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జఫ్రుల్లా

విత్తన కొనుగోలు బిల్లు అడిగి తీసుకోండి

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు విత్తనాలు కొనుగోలు చేయు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ విత్తనాల సంచులు సరైన సీలు, ధ్రువీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలకు సంబంధించి మొలక శాతం పరీక్షించుకున్న తర్వాతే నాటుకోవాలన్నారు. దుకాణాదారుడు నుంచి బిల్లు తీసుకోవాలని అలాగే డీలరు సంతకం తప్పనిసరిగా చేయించాలన్నారు. పంట నష్టం బిల్లు కీలకమన్నారు.

దేశానికి రాహుల్‌గాంధీ సేవలు అవసరం

సత్తెనపల్లి: రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ సేవలు, నాయకత్వం దేశానికి అవసరమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ అన్నారు. పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదనశెట్టి వేదాద్రి, షేక్ చాంద్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, షేక్ అజీము, కోట ఆనంద్, రవితేజ, కొరబండ ఆంటోనీ, జట్టి శేఖర్, మీసాల శంకర్, మెకానిక్ శివ, దర్శి చిన్న, తదితరులు ఉన్నారు.



పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఫర్నిచర్ వ్యాపారి జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర మొక్కుబడి కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే కారంపూడికి చెందిన ఆర్యవైశ్యుడు కర్నాటి గోపాలకృష్ణమూర్తి పెనుగొండకు చేపట్టిన 300 కిలోమీటర్ల పాదయాత్ర మూడో రోజు బుధవారం సత్తెనపల్లి చేరుకోవడంతో ఆయనను ఎమ్మెల్యే కన్నా అభినందించారు. ఆయా కార్యక్రమాలల్లో వివిధ హోదాల్లో ఉన్న నియోజకవర్గ, పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

విద్యాభివృద్ధికి స్నేహహస్తాలు సేవలు అభినందనీయం

ఎంఈవో నరసింహారావు

అచ్చంపేట: విద్యాభివృద్ధికి స్నేహహస్తాలు ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో రావిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ చుట్టూ ఫెన్సింగ్ నిర్మించేందుకు గాను బుధవారం స్నేహహస్తాలు ఫౌండేషన్ రూ.60 వేల చెక్కును పాఠశాల హెచ్‌ఎం ఆర్ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలలకు కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. ఎస్సీ కాలనీలోని పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో చుట్టూ ఫెన్సింగ్ నిర్మించుకునేందుకు రూ.1.10 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారన్నారు. ఇందులో రూ.50 వేలు వేసుకునేందుకు పాఠశాల ఉపాధ్యాయులు ముందుకు రాగా మిగిలిన రూ.60 వేలను స్నేహహస్తాలు సంస్థ అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు ఫౌండేషన్ నిర్వాహకులు ఎంవీ రావు కుమార్తె జోషిత, వారి అబ్బాయి హర్షిత్, సంస్థ సలహాదారు మామిళ్లపలి విజయలక్ష్మి, సంస్థ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు, సంస్థ ప్రతినిధి తుమ్మా శౌర్రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెక్కును హెచ్‌ఎంకు అందజేస్తున్న స్నేహహస్తాలు సంస్థ సభ్యులు

పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డులో గల పౌరసరఫరాల గోడౌన్‌ను సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. రేషన్‌కార్డుల ద్వారా పంపిణీ జరుగుతున్న బియ్యం, పంచదార సరుకుల తూకాలలో తేడాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు తెలుసుకునేందుకు ఆర్డీవో తనిఖీలు చేపట్టారు. ఆయనతో పాటు క్రోసూరు తహసీల్దార్, తూనికలు కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు. గోడౌన్‌లోని బియ్యం, పంచదార, కందిపప్పు తూకం వేసి సరిచూసుకున్నారు. అన్నీ తూకాల ప్రకారం ప్యాకింగ్ ఉన్నట్లు గుర్తించటం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి కార్డుదారుకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సువర్ణ, తూనికల శాఖ అధికారులు, జిల్లా అడిషనల్ కంట్రోలర్ అల్లారయ్య, గుంటూరు సీఐ సునీల్‌రాజు, సత్తెనపల్లి సీఐ షేక్ జాన్ సైదా, సిబ్బంది పాల్గొన్నారు.



గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, తూనికల శాఖ అధికారులు

సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు కృషి చేద్దాం

వైద్యాధికారిణి హేమ

రెంటచింతల: సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వై.హేమ అన్నారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా డే సందర్భంగా స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఆమె సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించి మాట్లాడారు. దేశంలో 17 రాష్ట్రాలలో ఈ సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఉన్నట్లు ఇది ఎక్కువగా గిరిజన ప్రాంతాలలో వ్యాపించినట్లు గుర్తించారన్నారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి(రక్తహీనత) 2047 నాటికి గిరిజన ప్రాంతాలలోని 0–40 ఏళ్ల మధ్య వయస్సున్న 7 కోట్ల మందికి అవగాహన కల్పించి వ్యాధిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాలలోనున్న ఎస్టీ సామాజిక వర్గాల ప్రాంతాలలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలచే సికిల్ సెల్ టెస్టులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 276 మందికి ఈ టెస్టులు చేయడం జరిగిందని, ప్రతి గ్రామంలో ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాలలో 0–40 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఈ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. మల్లవరం, గోలి, జెట్టిపాలెం, పశర్లపాడు తదితర గ్రామాలలో నున్న ఎస్టీలకు ఈ సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది మహేష్ బాబు, డి.సీతారామిరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి హేమ

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఏడీఏ బోయపాటి రవిబాబు

రెంటచింతల: విత్తనాలు విక్రయించే షాపుల నిర్వాహకులు అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విత్తన షాపులలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి మాట్లాడారు. లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. విత్తన షాపు నిర్వాహణకు సంబంధించి నిర్వాహకులు ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి(లైసెన్స్) తీసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమతులు (ప్రభుత్వ గుర్తింపు పొందని కంపెనీల) లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీ ధరలకు కచ్చితంగా ఇవ్వాలన్నారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలన్నారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లయితే అటువంటి షాపుల నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమతులు తీసుకోకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలను ఇక్కడ అమ్మడం నేరమన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రైతులకు కచ్చితంగా బిల్లులు పూర్తి వివరాలతో ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలలో మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



విత్తనాల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవో బ్రహ్మారెడ్డి